## పేద విద్యార్థులకు చేయూత



మెరిట్ స్టూడెంట్స్‌కు స్కాలర్‌షిప్స్ చెక్కులు అందజేస్తున్న బద్రీ విశాల్‌పన్నాలాల్ ట్రస్ట్ చైర్మన్ శరత్

బంజారాహిల్స్,డిసెంబర్ 9: తమవంతు బాధ్యతగా ప్రతిఏటా సామాజిక సేవా కార్యక్రమాల కోసం రూ.2.5కోట్లను ఖర్చు చేస్తున్నామని విశాల్ పన్నాలాల్ పిట్టి ట్రస్ట్ అధ్యక్షుడు, మేనేజింగ్ ట్రస్టీ శరత్ పిట్టి అన్నారు. పేద విద్యార్థులకు చేయూత ఇచ్చేందుకు ప్రతిఏటా ట్రస్ట్ ద్వారా అందించే స్కాలర్‌షిప్స్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బంజారాహిల్స్ రోడ్ నం. 1లో శనివారం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 600 మంది మెరిట్ స్టూడెంట్స్‌కు ట్రస్ట్ తరపున రూ.60 లక్షల విలువైన స్కాలర్‌షిప్స్ అందజేశారు. డిగ్రీ, ఎంబీఏ, ఎంబీబీఎస్ తదితర కోర్సుల్లో చదువుతున్న పేద విద్యార్థుల్లో 80 శాతం కంటే అధికంగా మార్కులు సాధించిన 600 మందిని ఎంపిక చేసి తాము స్కాలర్ షిప్స్ అందిస్తుంటామని శరత్ పిట్టి తెలిపారు. పలు ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు, వితంతులకు ఆర్థిక సాయం, కంటి సర్జరీలు, వృద్ధాశ్రమాలకు ఆర్థిక సాయం తదితర సేవా కార్యక్రమాల కోసం ప్రతిఏటా రూ.2.5 కోట్లను ఖర్చు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బద్రీ విశాల్ పన్నాలాల్ ట్రస్ట్ సభ్యులు విజయ్‌కుమార్, అగర్వాల్ సేవాదళ్ ప్రతినిధులు రతన్ గుప్తా, అజిత్, కైలాశ్ కేడియా, ప్రదీప్ అగర్వాల్, వినయ్ అగర్వాల్, సురేందర్ గోయల్ పాల్గొన్నారు.

## హరే రామ..హరే కృష్ణ..




బంజారాహిల్స్, డిసెంబర్ 9: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం కోకాపేటలో శ్రీ రాధా గోవింద రథయాత్ర కనులపండువగా జరిగింది. గండిపేట సమీపంలోని శ్రీకృష్ణ గో సేవా మండలి నుంచి ప్రారంభమైన రథయాత్ర పుర వీధుల మీదుగా సాగింది. హరినామ సంకీర్తనతో వీధులన్నీ మార్మోగాయి. ఇస్కాన్ బెంగళూరు, అక్షయపాత్ర ఫౌండేషన్ చైర్మన్ మధు పండిత దాస, హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యగౌరచంద్ర దాసతో పాటు వందలాది మంది భక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

## మెడ్‌టెక్ స్టార్టప్‌లకు ప్రోత్సాహం

సిటీబ్యూరో, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): మెడికల్ టెక్నాలజీ రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు అమెరికాకు చెందిన గ్లోబల్ వేల్స్ కంపెనీ.. టీ హబ్ కలిసి పనిచేస్తున్నది. రోవన్ ట్రీ సైంటిఫిక్ లిమిటెడ్ సీఈవో రాబర్ట్ సాల్టర్ ఇటీవల టీ హబ్‌ను సందర్శించి, అక్కడి స్టార్టప్ కంపెనీల కార్యకలాపాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇండియన్ స్టార్టప్ కంపెనీలు మంచి ఆవిష్కరణలు చేస్తున్నాయని, ఈ ఆవిష్కరణలకు ఇండియాలోనే కాకుండా విదేశాల్లోనూ మంచి మార్కెట్ ఉన్నదని, అందుకే తమ కంపెనీ టీ హబ్‌తో కలిసి పని చేసేందుకు సిద్ధమైందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కార్యాచరణను టీ హబ్ వెల్లడిస్తున్నదని, మెడిటెక్ రంగంలో స్టార్టప్ ఆవిష్కరణలు చేసే వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## కేసీఆర్ త్వరగా కోలుకోవాలని అజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



ఎర్రగడ్డ, డిసెంబర్ 9: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ బోరబండ డివిజన్ బీఆర్ఎస్ మైనార్టీ నేతలు అజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రధాన కార్యదర్శి ఫయాజ్‌ఖాన్, మహ్మద్ ఫరీదుద్దీన్ ఆధ్వర్యంలో పలువురు అజ్మీర్ దర్గాలో ప్రార్థనలు చేసిన అనంతరం చాదర్‌ను సమర్పించినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మూడోసారి విజయం సాధించిన సందర్భంగా మొక్కును తీర్చుకున్నామని ఫయాజ్‌ఖాన్ పేర్కొన్నారు.






కేబీఆర్ పార్కు వద్ద అవినీతి వ్యతిరేక వాక్‌ను ప్రారంభిస్తున్న మాజీ సమాచార కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు, ఉత్సాహంగా పాల్గొన్న బాలికలు

# దేశాన్ని పట్టి పీడిస్తున్న అవినీతిని నిర్మూలించాలి

*యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో 2కే రన్*

సిటీబ్యూరో, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ)/బంజారాహిల్స్: దేశాన్ని పట్టి పీడిస్తున్న అవినీతిని ప్రభుత్వాలు నిర్మూలించే దిశగా పనిచేయాలని మాజీ ఆర్టీఐ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు సూచించారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో ప్రపంచ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కేబీఆర్ పార్కులో అవినీతికి వ్యతిరేకంగా 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమాన్ని మాజీ ఆర్టీఐ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, మాజీ అడిషనల్ చీఫ్ సెక్రటరీ, రెడ్‌క్రాస్ చైర్మన్ అజయ్ మిశ్రా, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ వ్యవస్థాపకుడు రాజేంద్ర పల్నాటి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మన రాష్ట్రాన్ని, దేశాన్ని పట్టి పీడిస్తున్న అవినీతిని నిర్మూలించేందుకు ప్రయత్నించాలన్నారు. రాష్ట్రంలో నూతన బాధ్యతలు చేపట్టిన కొత్త ప్రభుత్వం ప్రజల ఆలోచనలకు అనుగుణంగా అవినీతి రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. సమాచార హక్కు చట్టంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ.. పెరిగిపోతున్న అవినీతికి రాజకీయ వ్యవస్థే ప్రధాన కారణమని, నేతలు తమ ప్రమాణస్వీకారంలో ధర్మం, న్యాయం గురించి మాట్లాడుతారని, ఆచరణలో లోపాలు ఎక్కువ ఉంటాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ మీడియా కార్యదర్శి జయరాం, కార్యవర్గ బృందం మారియా, అంథోని, డాక్టర్ ప్రతిభాలక్ష్మి, డాక్టర్ నూరి ఫరి, సంతోషిణి, కొన్నె దేవేందర్, బత్తిని రాజేశ్, వరికుప్పల గంగాధర్, కొమటి రమేశ్‌బాబు, ముడావత్ రమేశ్‌నాయక్, శ్రీలేఖ, ఈశ్వర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా వేవ్‌రన్



నానక్‌రాంగూడ ఐటీ కారిడార్‌లో వేవ్‌రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్, రన్‌లో పాల్గొన్న ఐటీ ఉద్యోగులు

శేరిలింగంపల్లి, డిసెంబర్ 9: నానక్‌రాంగూడ ఐటీ కారిడార్‌లోని ప్రముఖ ఐటీ సెజ్ వేవ్‌రాక్‌లో 'వేవ్‌రన్' ఐదో ఎడిషన్ శనివారం ఉత్సాహంగా సాగింది. రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 3కే, 5కే, 10కే విభాగాల్లో నిర్వహించిన ఈ ప్రత్యేక రన్‌లో వేక్‌రాక్ ఐటీ పార్క్‌కు చెందిన దాదాపు 3వేల మంది ఐటీ ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వేక్‌రాక్ సీనియర్ డైరెక్టర్ కల్నల్ సంజయ్ భరద్వాజ్‌తో పాటు వివిధ సంస్థలు ఐటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# తొలి సామాజిక మాధ్యమం అమెచ్యూర్

- ఫేస్‌బుక్, వాట్సాప్ లేని రోజుల్లోనే సమాచార మార్పిడి వ్యవస్థ
- రెండో ప్రపంచ యుద్ధంలోనూ అమెచ్యూర్ రేడియో సేవలు
- ముఫకంజా కాలేజీలో లామాఖాన్ అమెచ్యూర్ రేడియో క్లబ్ 6వ వార్షిక సదస్సు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

సిటీబ్యూరో, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : ప్రపంచంలోనే తొలి సామాజిక మాధ్యమంగా అమెచ్యూర్ రేడియో అని, రెండో ప్రపంచ యుద్ధ సమయంలోనూ వీటి సేవలను విరివిగా ఉపయోగించారని లామాఖాన్ అమెచ్యూర్ రేడియో నిర్వాహకులు అన్నారు. బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం లామాఖాన్ అమెచ్యూర్ రేడియో క్లబ్(లార్క్) ఆరో వార్షిక సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఔత్సాహిక రేడియో కమ్యూనికేషన్ నిపుణులు, రేడియో ఇంజినీర్లతోపాటు, అమెచ్యూర్ రేడియో నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు. రెండ్రోజుల సదస్సు నేటితో ముగియనుండగా, దేశంలోని 400కు పైగా అమెచ్యూర్ రేడియో నిపుణులు, నిర్వాహకులు సదస్సుకు హాజరయ్యారు. టెక్నికల్ సెషన్‌లో భాగంగా ఈ రంగంలో వచ్చిన మార్పులు, ఆధునిక టెక్నాలజీ, రేడియో ఫ్రీక్వెన్సీ ప్రాధాన్యత, అమెచ్యూర్ రేడియో ప్రయోజనాలు, ఈ రంగంలో చోటు చేసుకున్న మార్పులపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో సదస్సు ముఖ్యోద్దేశాలను నిర్వాహకులు వివరించారు. కార్యక్రమానికి ప్రాతినిధ్యం వహించిన లామాఖాన్ అమెచ్యూర్ రేడియో క్లబ్ ప్రెసిడెంట్ శశిభూషణ్ మాట్లాడారు. ఆధునిక టెక్నాలజీకి అమెచ్యూర్ రేడియో నాంది పలికిందన్నారు. లామాఖాన్ అమెచ్యూర్ రేడియో క్లబ్ సభ్యులుగా ఈ రంగంపై ఆసక్తి కలిగిన ఎంతో మంది ఔత్సాహికులు పనిచేస్తున్నారని, వీరిందరికీ ప్రత్యేక శిక్షణ, టెక్నికల్ సెషన్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. అమెచ్యూర్ రేడియో ఔత్సాహికులు ఆవుల అమరేంద్ర మాట్లాడుతూ ప్రపంచంలోని తొలి సోషల్ మీడియా వేదికగా అమెచ్యూర్ రేడియో నిలుస్తుందన్నారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలోనే వీటిని వినియోగించారు. సమాచార మార్పిడిలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న టెక్నాలజీకి అమెచ్యూర్ రేడియో టెక్నాలజీ నాంది పలికిందన్నారు. ముఫకంజా ఈసీఈ శాఖాధిపతి అయేషా నాజ్ మాట్లాడుతూ... టెక్నాలజీ రీసెర్చ్, డెవలప్‌మెంట్‌కు ఈ తరహా కార్యక్రమాలతో సాధ్యమవుతుందని ముఫకంజా ఇంజినీరింగ్ హెచ్‌వోడీ అయేషా నాజ్ అన్నారు. లామాఖాన్ అమెచ్యూర్ రేడియో క్లబ్ ద్వారా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ రంగంలో వస్తున్న ఆధునిక టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన పెరుగుతుందన్నారు. అనంతరం సదస్సులో ఏర్పాటు చేసిన స్టాళ్లను లార్క్ సభ్యులు సందర్శించారు. రేడియో టెక్నాలజీలో వినియోగించే పరికరాలు, విడి భాగాలు, త్రీడీ ప్రింటింగ్ విధానాలను పరిశీలించారు. ఆదివారం 10గంటల నుంచి టెక్నికల్ సెషన్ ప్రారంభం కానుండగా, వర్క్ షాప్, బహుమతుల పంపిణీ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో లార్క్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస రెడ్డి, ఔత్సాహిక అమెచ్యూర్ రేడియో నిర్వాహకులు పాల్గొన్నారు.